ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024




ఓపెన్‌టాప్ వాహనంలో నిల్చొని ర్యాలీగా వస్తున్న పవన్


పాలకొండలో సభకు హాజరైన ప్రజలు, అభిమానులు కూటమి శ్రేణులు

ప్రసంగిస్తున్న జనసేనాని పవన్

వైసీపీని తరిమికొట్టండి

- జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు
- అన్ని వర్గాలనూ ప్రభుత్వం ముంచేసింది
- రంగులకే రూ.వేల కోట్లు తగలేసింది
- గిరిజనుల సమస్యలను మాత్రం పట్టించుకోలేదు
- కనీసం ట్రైకా రుణాలు కూడా ఇవ్వలేదు
- జలాశయం పనులను పూర్తి చేయించలేదు
- తెగించి.. ఎదురించాలని పిలుపునిచ్చిన పవన్ కల్యాణ్
- పాలకొండలో వారాహి యాత్ర విజయవంతం
- జనసేన అధినేతకు అడుగడుగునా నీరాజనం
- భారీగా హాజరైన కూటమి శ్రేణులు, అభిమానులు

(పాలకొండ)

ఓటు అనే అయుధంతో జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం హెలీకాఫ్టర్‌లో విశాఖ నుంచి నేరుగా పాలకొండ చేరుకున్నారు. తొలుత అశేష ప్రజానీకం, కూటమి అభ్యర్థులు, శ్రేణులు, అభిమానులు, నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలకొండలోని వడమ సెంటర్‌లోని బహిరంగ సభకు వద్దకు చేరుకున్నారు.

లక్షల కార్మికుల పోరాటమా... ఓ శ్రీకాకుళమా.. కార్మికుల కన్నీటి వీడ్కోలు ఈ సుందరపు సిక్కోలు.. అని జనసేనాని పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'పని, కష్టం, కృతజ్ఞతే సిక్కోలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు తెలుసు. ఉత్తరాంధ్ర అంటే తనకు పంచప్రాణాలని అన్నారు. 'విప్లవ కవి శ్రీశ్రీ, తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి వంటి జన్మనిచ్చిన నేల ఇది. పాలకొండ నియోజకవర్గం అరకు పార్లమెంట్‌లో ఉన్న అన్నదమ్ములు, ఆడపడుచులు, యువత ఎంతో మంచి మనసున్న వారు. ఈ ప్రాంతం భాష, యాస, కళలు గుండెను కదలిస్తాయి. పెద్ద పెద్ద పోస్టర్లు వేయించడం తప్ప జగన్ చేసింది ఏమీ లేదు. ఎవరి కలలనూ నిజం చేయలేదు. జగన్ ఏదైనా చేశాడంటే ఇసుక దోచుకోవడం, మందు రేట్లు పెంచడమే. అన్ని వర్గాలనూ వైసీపీ ప్రభుత్వం ముంచేసింది. జగన్ రెడ్డి పాలనలో యువతికి ఉపాధి అవకాశాలు లేవు. మెగా డీఎస్సీ కూడా ప్రకటించలేదు. తోటపల్లి ఆధునికీకరణ చేయలేదు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయలేదు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి మడమ తిప్పారు.' అని ఆయన అన్నారు.

గిరిజనులకు ట్రైకార్ రుణాలు నిలిపేశారు..

'చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవాలనుకునే గిరిజనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ట్రైకార్ రుణాలు అందించేవారు. గిరిజనులకు అందించే రుణాల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 35 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. మిగిలిన ఐదు శాతం లబ్ధిదారులు తిరిగి కడితే సరిపోయేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఈ రుణాలను నిలిపివేసింది. అరకొర ఇచ్చిన వారికి కూడా సబ్సిడీని 35 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. నేను మాట ఇస్తున్నా.. కూటమి ప్రభుత్వం రాగానే గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. స్వయం ఉపాధి చేసుకొనేవారికి పాత సబ్సిడీపై ట్రైకార్ రుణాలు అందిస్తాం' అని ఆయన అన్నారు.


సభలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్

సంగ్రామానికి ఎక్కువ సమయం పట్టదు...

'సిక్కోలు అంటే ఉద్యమాల పురిటిగడ్డ. ఈ ప్రాంతంలో అన్యాయాన్ని ఎదురించేతత్వం ఉంది. 1960లో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గడ్డ ఇది. ఇప్పుడు జగన్ లాంటి దోపిడీదారుడిని నిలువరించలేమా? సూర్యుడు నుంచి సూర్యుడికి మధ్య 24 గంటల మధ్య దూరం. మనిషి నుంచి మనిషికి రెండు గుండెలే దూరం. జగన్ దోపిడీ, దౌర్జన్యాలు, చూస్తూ ఊరుకుంటామా?' అని పవన్ వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రలో స్థానికుల నుంచి భూములు లాక్కుంటున్నారని, తప్పు జరిగినప్పుడు ఎదురించకపోతే భవిష్యత్తు తరం నలిగిపోతుందని తెలిపారు. ప్రజలు తెగిస్తే.. సంగ్రామానికి ఎక్కువ సమయం పట్టదన్నారు.

రంగులకు రూ.2,300 కోట్లు తగలేసింది...

'వైసీపీ అధికారంలోకి వచ్చాక తోటపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు పడకేశాయి. 32 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎడమ కాలువ పనులు నత్తకడన చేపట్టింది. జంపరకోట పనులు పూర్తవ్వడానికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తే చాలు. వేలాది ఎకరాలకు నీరందించి రైతుల కన్నీరు తుడవచ్చు. వైసీపీ ప్రభుత్వం మాత్రం పార్టీ రంగులు వేయడానికి, తీయడానికి అక్షరాలా రూ.2,300 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో పదో వంతు రూ.214 కోట్లు ఖర్చు చేస్తే తోటపల్లి ఎడమ కాలువ, జంపరకోట పనులు పూర్తయ్యేవి' అని పవన్ చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి విరాళం...

'ప్రతిచేనుకు నీరు, ప్రతి చేతికీ పని.. ఇదే కూటమి లక్ష్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తాం. వృద్ధాప్య పింఛను నాలుగు వేలు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తాం. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తాం. ప్రతి మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తాం. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి రూ.450 కోట్లను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. సంక్షేమ నిధిని తిరిగి పునరద్ధరిస్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రూ.కోటి విరాళంగా అందిస్తా. సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తాం. ఏనుగుల దాడికి గురైన ప్రతి రైతును ఆదుకుంటాం. సీపీఎస్ రద్దుకు ఏడాదిలోగా బలమైన పరిష్కారం చూపిస్తాం.' అని పవన్ వ్యాఖ్యానించారు.

పాలకొండను బంగారు కొండగా మారుస్తాం...

'పాలకొండ నియోజకవర్గంలో వాగులు, వంకలు, జలపాతాలు అధికం. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం. సీతంపేట, భామిని మండలాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయి. ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించేలా బాధ్యత తీసుకుంటా. వైసీపీ ప్రభుత్వం ఎస్టీలకు తొలగించిన 16 పథకాలను పునరుద్ధరిస్తాం. పాలకొండను బంగారు కొండగా మారుస్తాం.' అని పవర్ హామీ ఇచ్చారు. కూటమి తరఫున అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, పాలకొండ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, కూటమి నేతలు దానేటి శ్రీధర్, చంద్రమోహన్, సత్తిబాబు, గంగులయ్య, రవికుమార్, టీడీపీ నాయకులు కె.అప్పల నాయుడు, సంతోష్, పి.కృష్ణమూర్తినాయుడు, సాగర్, భూదేవి, రామి నాయుడుతదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి...

తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని పాలకొండ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం జనసేనాని పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారాహి విజయయాత్రలో ఆయన మాట్లాడారు. పవన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంతో కలిసి నియోజక వర్గంలో గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవచూపుతానన్నారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా.. నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలకు తాగునీరు, రహదారి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత మాట్లాడుతూ.. సైకో జగన్మోహన్‌రెడ్డి ఒక్క చాన్స్ అంటూ.. అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అవినీతి ఆంధ్రాగా మార్చారని ఆరోపించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చొరవతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. ఈ మహా కూటమి అభ్యర్థులను గెలిపించి వైసీపీ అవినీతి పాలనను అంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

కొండలు దిగి.. బ్యాంకులకు వచ్చి..!

- పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారుల అవస్థలు
- ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపాటు
- తమపై కక్షగట్టి ఇలా చేస్తోందని ఆగ్రహం


మక్కువలో ఓ బ్యాంకు వద్ద పింఛనుదారులు ఇలా..

పార్వతీపురం, మే2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో పింఛన్‌దారులకు గురువారం అవస్థలు తప్పలేదు. ఈ నెల పింఛన్ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో దివ్యాంగులు, వృద్ధులు తదితరులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. గ్రామీణ ప్రాంతవాసులు మండు టెండలో సుమారు 15 నుంచి 20కిలోమీటర్లు ప్రయాణించి పట్టణాల్లో ఉన్న బ్యాంకులకు చేరాల్సి వచ్చింది. గిరిజన ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులైతే కొండలు దిగి ఉదయాన్నే బ్యాంకుల వద్దకు చేరుకుని క్యూలైన్‌లో నిరీక్షించారు. దీంతో పింఛన్‌దారులు వైసీపీ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కొన్నిచోట్ల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం, కేవైసీ కాకపోవడం, జీరో బ్యాలెన్స్ ఉండడం, కొద్ది నెలలుగా వారి ఖాతాల నుంచి లావాదేవీలు జరగకపోవడంతో పింఛన్‌దారులు పింఛన్ నగదు తీసుకునేందుకు ఇక్కట్లపాలయ్యారు. విత్‌డ్రా ఫాం నింపలేకపోవడం, సర్వీసుల పేరుతో డబ్బులకు కోత పడడంతో ఇంకొందరు ఆవేదనతో తిరుగుముఖం పట్టారు. మొత్తంగా జిల్లాలో ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛను దారుల అవస్థలే కనిపించాయి. ఇదంతా వైసీపీ కుట్ర అని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానించారు. తమపై కక్ష గట్టి ఇదంతా చేస్తోందని ఆరోపించారు. 'గత నెల సచివాలయాల్లో పింఛను ఇచ్చారు కదా.. ఈసారి అలా ఎందుకు ఇవ్వలేదు. మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికే సర్కారు పింఛన్ డబ్బులను బ్యాంకు ఖాతాలో వేసింది.' అని మరి కొందరు వాపోయారు. పోలింగ్ రోజున ఓటుతో తగిన విధంగా బుద్ధి చెబుతామని తెలిపారు.

వివిధ చోట్ల ఇలా..

- **పార్వతీపురం రూరల్:** మండలంలోని 30 పంచాయతీల పరిధిలో అనేక మంది పింఛన్‌దారులు పార్వతీపురంలో బ్యాంకుల వద్ద గంటలకొద్దీ లైన్‌లో నిరీక్షించారు. ఇంకొందరు వాటర్ ప్యాకెట్లు తలపై పెట్టుకుని బ్యాంకు ప్రాంగణంలోనే కూర్చోవల్సి వచ్చింది.
- **గరుగుబిల్లి:** మండలంలో పలు రకాల పింఛన్లు 8,400 ఉన్నాయి. 70 శాతం మేర లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ మొత్తాలు జమయ్యాయి. అయితే పింఛన్‌దా రులకు మండల కేంద్రంలోని బ్యాంకుల్లో నిరీక్షణ తప్పలేదు.
- **గుమ్మలక్ష్మీపురం:** మండలంలో 6,700 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 895 మందికి వారి ఇళ్లకు పంపిణీ చేశారు. అయితే మారుమూల పంచాయతీలైన వంగర, నోండ్రుకోన, కేదారిపురం, రెళ్లగొయ్యిపాక, బీరుపాడకు చెందిన పింఛనుదారులు ఉదయాన్నే మండల కేంద్రంలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు.
- **మక్కువ:** పింఛన్‌దారులతో మండల కేంద్రంలోని పలు బ్యాంకులు రద్దీగా మారాయి. ఎండలు మండుతుండగా.. బ్యాంకు లకు వెళ్లేందుకు పెన్షన్‌దారులు ఆపసోపాలు పడ్డారు.
- **భామిని:** మండలంలో 7,089 మంది పింఛనుదారులు ఉండగా 5,326 మంది బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్ము జమ చేశారు. కాగా పింఛన్‌దారులతో భామినిలో బ్యాంకులు కిక్కిరిశాయి. బ్యాంకు మిత్రల ద్వారా పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.
- **సీతంపేట:** మండుటెండలో మండలం నలుమూలల నుంచి పెద్దఎత్తున పింఛన్‌దారులు బ్యాంకులకు చేరారు. అయితే కొన్ని బ్యాంకుల వద్ద నేరుగా నగదు చెల్లించ కుండా సర్వీస్ కేంద్రాల సాయంతో పింఛన్లు చెల్లించారు.
- **సీతానగరం / బలిజి పేట:** సీతానగరంలోని ఓ బ్యాంకు బీసీ పాయింట్ వద్ద పింఛన్ దారులు నిరీక్షిం చారు. కొన్ని బ్యాంకుల్లో సర్వర్ , ప్రింట్ మిషన్ పనిచేయ కపోవడంతో చాలా దూరం నుంచి వచ్చిన లబ్ధి దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బలిజిపేటలోని పలు బ్యాంకుల వద్ద కూడా పింఛన్‌దారులకు ఈ అవస్థలు తప్పలేదు.

వ్యక్తిగతంగా లేఖ ఇచ్చా ...

నా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు. దీంతో నాకు పింఛన్ ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు నిరా కరించారు. తర్వాత నేను బ్యాంక్ అధికారు లతో మాట్లాడి వ్యక్తిగతంగా ఒక లేఖరాసి ఇచ్చాను. అప్పుడు నాకు పింఛన్ ఇచ్చారు.

\- సంగం,
పింఛన్‌దారుడు, పార్వతీపురం

మండుటెండలో ప్రయాణించి..

మండుటెండలో సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించి.. పింఛన్ కోసం బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చింది. గత నెలలో ఇంటికి తెచ్చి ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. ఓటు ద్వారా వైసీపీకి తగిన విధంగా బుద్ధి చెబుతాం.

\- ఓ పింఛన్‌దారుడు,
పార్వతీపురం


సీతంపేటలో..


భామినిలో..


సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఏనుగుల బెడద తప్పిస్తాం

- అరకు పార్లమెంట్‌ను అభివృద్ధి చేసి చూపిస్తాం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

పార్వతీపురం, మే2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర రవాణా శాఖ మంత్రి మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అరకు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజక వర్గాలను అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన హెలీకాఫ్టర్‌లో విశాఖ నుంచి నేరుగా పార్వతీపురం వచ్చారు. అనంతరం పట్టణ సమీపంలోని చిన్నబొండపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 'ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం. నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. రూ.35 వేల కోట్లతో విశాఖ నుంచి రాయపూర్ వరకు రహదారి నిర్మాణం చేపడుతున్నాం. అరకు పార్లమెంట్ పరిధిలో రూ.22 వేల కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నాం. మన్యం జిల్లా పరిధి సాలూరులో బైపాస్ రహదారిని నిర్మించాం. రహదారులు బాగుంటే ఏ ప్రాంతమైనా బాగా అభివృద్ధి చెందుతుంది. రైతుల సమస్యలను పరిష్కరించేలా అనేక చర్యలు తీసుకున్నాం. అప్పటి సీఎం చంద్రబాబుతో కలిసి రాష్ట్రంలో పోలవరం పనుల మంజూరుకు కృషి చేశాం. నదుల అనుసంధానానికి కట్టుబడి ఉన్నాం. ఈ ఎన్నికల్లో అరకు పార్లమెంట్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతను గెలిపించండి. పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న బోనెల విజయచంద్రను గెలిపించండి' అని ఆయన కోరారు.

ఎండను సైతం లెక్కచేయక...

ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు భారీగా సమావేశానికి తరలివచ్చారు. సుమారు గంట ఆలస్యంగా కేంద్రమంత్రి హాజరైనప్పటికీ .. ఆయన ప్రసంగం పూర్తయ్యే వరకు ఎవరూ కదలలేదు. అందరూ ఆసక్తిగా ప్రసంగాన్ని విన్నారు. 'పార్వతీపురం ప్రజలకు నమస్కారములు' అని కేంద్ర మంత్రి తెలుగులో మాట్లాడేసరికి.. సభకు హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కేరింతలతో సందడి చేశారు.

● మద్య నిషేధం ఎక్కడ?

అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత మాట్లాడుతూ.. 'దశల వారీగా మద్యం నిషేధం అమలు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పింది. నాసిరకం, కల్తీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 35 లక్షల మంది అనారోగ్యానికి గురయ్యారు. 30 వేల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుంది' అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు.

● వైసీపీని ఇంటికి పంపిద్దాం

టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వ నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిద్దాం. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పార్వతీపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం' అని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ సీనియర్ నాయ కులు శివన్నారాయణ, పరశు రామరాజు, ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, టీడీపీ నాయకులు శ్రీదేవి, వెంకటనాయుడు, చంద్రమౌళి, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి

పీపుల్స్ మేనిఫెస్టో

రామ మందిరాలకు ఉచిత విద్యుత్ అందించాలి



సాలూరు రూరల్: రామమందిరాలకు, దేవాలయాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలి. రామమందిరాలు, దేవాలయాలకు ఇళ్ల కంటే అధిక విద్యుత్ చార్జీలు వసూలు చేస్తుండడం దారుణం. ఆధ్యాత్మిక ప్రదేశాలు కాబట్టి వాటికి ఉచిత విద్యుత్‌ను ప్రకటించాలి. వివాహాలు, శుభకార్యాల కోసం నిర్మించిన ధర్మశాలలకు మున్సిపల్ ఆస్తి పన్ను నుంచి మినహాయించాలి. కమ్యూనిటీ సహకారంతో అందరికి వినియోగపడే వాటిపై ఆస్తి పన్ను భారం మోపడం సరికాదు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఉంది.

- గౌడు రమణ, సాలూరు

ఖైదీలకూ ఓటుహక్కు

మీకు తెలుసా

విజయనగరం: రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాలతో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటుహక్కు ఉంటుందా.. ఉండదా అన్న ప్రశ్న చాలామందికి తలెత్తుంది. ఖైదీలు కూడా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంటివ్ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని తెలియజేస్తూ... పోలింగ్ బూత్.. ఓటరు క్రమసంఖ్యతో ఓటువేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి.. ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

అప్పుడు ధర్మయుద్ధం... ఇప్పుడు ధనయుద్ధం

పెద్దల మాట



భామిని: అప్పట్లో ఎన్నికలంటే ధర్మయుద్ధంగా ఉండేవి. నాయకులు మాట ఇస్తే జవదాటేవారు కాదు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నాయకులు తీర్చేవారు. ఇప్పుడు ఎన్నికలు అడుగుడునా ఎత్తుగడలు, ధన యుద్ధంగా మారాయి. ఓటర్లను, నాయకులను ప్రస్తుతం నమ్మే సితిలో లేరు. ఇప్పుడు ఓటరు హక్కులను యంత్రాలకు ఇవ్వడం వల్ల మాలాంటి వృద్ధులం ఎవరికి ఓటు వేస్తామో తెలియని పరిస్థితి నెలకొంది. నా ఓటు గుట్టుగా వేసేవాడిని. ఇప్పుడు యంత్రాలతో ఓటు వేయడం వల్ల ఎవరికి వేస్తున్నానో... ఏ గుర్తుకు పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఈ ప్రాంత గిరిజనులు మణిగ, కోటకొండ, బం ద్రసింగి, మూలగూడ తదితర గ్రామాల నుంచి సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వచ్చి ప్రశాంతంగా ఓటు వేసి వెళ్లేవారు. ఇప్పుడు వీధికొక నాయకుడు ఓటర్ల దగ్గరకు వచ్చి... ఈ గుర్తుకు వేయాలని.. ఆ గుర్తుకు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

- గోరుచుట్టు బుచ్చి, భామిని

బాబాయ్.. అబ్బాయ్..
రెండు పార్టీలు

(రాజాం రూరల్)


ఉత్తరాంధ్రలో బాబాయ్.. అబ్బాయ్.. అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది కింజరాపు అచ్చెన్నాయుడు.. రామ్మోహన్ నాయుడే. ఈ ఇద్దరి జోడీ ప్రతి ఎన్నికల్లోనూ గెలుస్తూ వస్తున్నారు. వీరిలాగే రాజాంలోనూ మరో బాబాయ్... అబ్బాయ్ ఉన్నారు. వారే కంబాల జోగులు.. కంబాల రాజవర్దన్. గత ఎన్నికలలో రాజాం నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన ఈ బాబాయ్... అబ్బాయిలు ఈసారి వేర్వేరు నియోజకవర్గాల నుంచి.. వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికలలో రాజాం నియోజకవర్గం నుంచి కంబాల జోగులు వైసీపీ నుంచి పోటీ చేయగా... అతని సోదరుడి కుమారుడు కంబాల రాజవర్దన్ జాతీయ కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. గడచిన అయిదేళ్లలో కంబాల జోగులు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించక పోవడం... వ్యక్తిగత అభివృద్ధికే పెద్దపీట వేయడం, సాధారణ సమస్యలు సైతం పరిష్కరించలేకపోవడం... పట్టణంలో రెండో విడత విస్తరణకు సంబంధించి కేవలం రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణం పనులు కూడా పూర్తి చేయించలేకపోవడం వంటి కారణాల వల్ల రాజాంలో జోగులు ఓటమి ఖాయమని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను రాజాం నుంచి పాయకరావుపేటకు బదిలీ చేశారు. అక్కడి నుంచి ఎన్నికల బరిలో దించారు. కంబాల రాజవర్దన్ ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి బి-ఫారం తెచ్చుకుని పోటీ చేస్తున్నారు. రాజవర్దన్ తండ్రి కంబాల రాజరత్నం పాలకొండ నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు.


కంబాల జోగులు


కంబాల రాజవర్దన్

పైసలు కావలె!

- సమీపిస్తున్న ఎన్నికల తేదీ
- ప్రతి కదలికా.. డబ్బుతోనే..





(రాజాం రూరల్)

జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా డబ్బు.. డబ్బు.. డబ్బు.. అనే మాట వినిపిస్తోంది. పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఎంత డబ్బున్నా చాలని పరిస్థితి కనిపిస్తోంది. పట్టుమని పది రోజులే ఉండడంతో అసలైన ఖర్చంతా ఇప్పుడే ప్రారంభం కానుంది. ప్రచార కార్యక్రమాలతో పాటు ఓటర్లను ఆకట్టుకునేందుకు కొంతమంది అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఎన్నికలలో ఎంత ఖర్చు చేస్తే అంత లాభిస్తుందన్న ఆలోచనతో అభ్యర్థులు వెనుకా ముందూ చూడడం లేదు. పైసలు లేనిదే అభ్యర్థులు ఇంటి నుంచి బయటకు కాలు పెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు డబ్బును ముందస్తుగా సమకూర్చుకోగా.. మరికొందరు నాయకులు మాత్రం డబ్బు కోసం వెతుకులాట ప్రారంభించారు. ఖర్చు చేయడంలో కాస్త వెనుకంజలో ఉన్నారు.

నిఘా వల్ల ఇబ్బంది

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. నిఘా పెంచింది. అభ్యర్థుల ఖర్చులపై మూడోకన్ను తెరిచింది. ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించింది. బ్యాంకుల నుంచి చేసే లావాదేవీలపై కూడా కన్నేసింది. దీంతో అభ్యర్థులు, వారి స్నేహితులు, బంధువులు, అత్యంత నమ్మకస్తులతో ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. ఈసారి తేడా వస్తే ఇక ఇంతేనన్న భయం వారిని వెంటాడుతోంది. ఫలితంగా చావో రేవో ఈ ఎన్నికలలోనే తేల్చుకుందామనే ఆలోచన నెలకొంది. అవసరమైతే బంగారం, భవనాలు అమ్మేందుకు కూడా వెనుకాడని పరిస్థితి కొంత మంది అభ్యర్థుల్లో కనిపిస్తోంది. గెలిస్తే అంతకంత సంపాదించుకో వచ్చుననే ఆలోచనతో కొంతమంది ప్రయివేటు ఫైనాన్షియర్లపై ఆధారపడుతున్నారు. ఎన్నికల ముందురోజు అర్ధరాత్రి వరకూ డబ్బుతోనే అసలైన పని కాబట్టి ఓటర్లను ప్రలోభపెట్టందుకు బహుమతులు, చీరలు, చిన్నపాటి వెండి వస్తువులు పంపిణీ చేసేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో పలుచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు పట్టుబడుతున్న బంగారు, వెండి ఆభరణాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ప్రధానంగా పోలింగ్‌కు ఒకరోజు ముందు డబ్బుతో పాటు మందు బాటిళ్లు కూడా అందజేసేందుకు జిల్లాలో లిక్కర్ మాఫియా రంగంలోకి దిగింది. మద్యం షాపులు, బార్లలో క్వార్టర్ బాటిల్ కూడా దొరక్కపోవడానికి ఇదో కారణంగా తెలుస్తోంది.

రూ. 500 నోటే దిక్కు..

ఈసారి రూ.500 నోట్లు దిక్కుగా నిలవనున్నాయి. ఒకటికి బదులు నాలుగు నోట్లు ఇవ్వాల్సి రావడం... నగదు రవాణాలో కూడా ఈ నోట్లతో ఇబ్బందులు తలెత్తుతుండడం నాయకులకు శిరోభారంగా మారుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రూ.2 వేల నోటు హంగామా చేసింది. గత ఏడాది రిజర్వ్‌బ్యాంక్ రూ.2 వేల నోట్లు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం రూ.500 నోట్ల లావాదేవీలు పెరిగాయి. ఫలితంగా మార్కెట్లో వీటి సంఖ్య గత నెలరోజులుగా తగ్గుముఖం పడుతోంది. కేవలం రూ.200, రూ.100 ఎక్కువగా మార్కెట్లో కనిపిస్తున్నాయి.



ఓటును నేనండి.. నా కథ వినండి!


(చీపురుపల్లి)

నేనే 'తల' రాతలు మార్చేది నేనే. పాలకులకు దిశా నిర్దేశం చేసేది నేనే. ప్రజాస్వామ్య మనుగడకి మూలం నేనే. అంతటి ప్రాధాన్యం ఉన్న నా చరిత్ర తెలుసుకోకుండానే అందరూ నా గురించి మాట్లాడేసుకుంటున్నారు. అసలు నేనెవరిని.. ఎలా పుట్టాను... శతాధిక వయోభారంలోనైనా నా గురించి నాలుగు మాటలు చెప్పని వ్వండి. నేను ఓటును. అసలింతకీ నా పుట్టుక ఎలా జరిగిందంటే... స్వాతంత్ర్యానికి పూర్వం.. 1907లో రాయల్ కమిషన్, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నా గురించి కొన్ని సిఫారసులు చేసింది. దాంతో 1909లో అమలులో ఉన్న కౌన్సిల్ చట్టం అప్పట్లో పరిమితంగా ఈ దేశ పౌరులకు తొలిసారిగా 'ఓటు'గా నన్ను పరిచయం చేసింది. 1919లో ఆ చట్టాన్ని మరింత విస్తృత పరిచారు. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా నన్ను వినియోగించుకొనే హక్కును 10.6 శాతం ప్రజలకు కల్పించారు. అనంతరం రాజ్యాంగ పరిషత్ ఎన్నికల సందర్భంగా దాన్ని 28.5 శాతానికి పెంచారు. బ్రిటిష్ కాలంలో అలా నా జీవన గమనం ప్రారంభమైంది. ప్రజాస్వామ్య సమానత్వ సూత్రాన్ని అనుస రించి ఒక వ్యక్తి... ఒక ఎన్నికలో... ఒకేసారి నన్ను ఉపయోగించే అవకా శం కల్పించారు. రాజ్యాంగంలోని అధికరణం 325 ప్రకారం కుల, మత, వర్గ, వర్ణ, జాతి, ప్రాంత, లింగ భేదాలు లేకుండా అందరూ నన్ను వినియోగించు కోవచ్చు.

- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా 326 అధిక రణం కింద సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించారు.
- 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను వినియో గించేందుకు కనీస వయోపరిమితి ని 21 ఏళ్ల నుంచి 18కి తగ్గించింది.
- బ్యాలెట్ పత్రంపై స్టాంపుతో ఇంకు ముద్ర వేసే స్థాయి నుంచి మీట నొక్కి ఓటు వేసే స్థాయికి నన్ను చేర్చారు. ఇప్పుడైతే, ఎవరికి సపో ర్టుగా నన్ను వినియోగించారో కూడా తెలుసుకొనే వీవీ ప్యాట్స్ విధానాన్ని కూడా తెచ్చారు.

విన్నారు కదా... ఇదీ నా పూర్తి కథ. మరో పది రోజుల్లో.. అంటే ఈ నెల 13న నా పండగ జరుగబోతోంది. ఆ పండగలో మీరంతా పాలు పంచుకోవాల్సిందిగా ప్రతి ఒక్కరినీ పేరు పేరునా విజ్ఞప్తి చేస్తున్నాను. నాకున్న విలువను సరైన పద్ధతితో వినియోగించుకోవలసిందిగా కోరుతూ..

ఇట్లు
మీ ఓటు







ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు.. అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

పవన్ పర్యటన ఇలా..

(పాలకొండ/సీతంపేట/వీరఘట్టం)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పాలకొండలో పర్యటించారు. స్థానిక వడమ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన పర్యటన వివరాలు...

- సాయంత్రం 3.50 గంటలకు పాలకొండ, వీరఘట్టం రోడ్డులోని గజలాఖానా వద్ద హెలీప్యాడ్ వద్దకు పవన్ కల్యాణ్ చేరుకున్నారు. నేరుగా ప్రత్యేక వాహనంలోకి వెళ్లారు.
- సాయంత్రం 4.15 నుంచి 4:45 గంటల వరకు హెలీప్యాడ్ నుంచి రోడ్‌షో నిర్వహించారు.
- ఈ రోడ్డుషో వీరఘట్టం జంక్షన్, కోటదుర్గమ్మ ఆలయం, నాగవంశపువీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వడమ సెంటర్‌లోని సభాస్థలి వరకు సాగింది. సుమారు అరగంట పాటు సాగిన రోడ్‌షోకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. పూలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆదరించారు. పెద్దఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.
- భారీ జన సందోహం నడుమ ఓపెన్‌టాప్ వాహనంలో అభివాదం చేస్తూ పవన్‌కల్యాణ్ సభాస్థలికి చేరుకున్నారు.
- భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులతో రహదారులు కిక్కిరిశాయి. జనసేనానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జేజేలు పలికారు. మరోవైపు పవన్‌ను చూసేందుకు కొందరు రహదారికి ఇరువైపులా ఉన్న భవనాలు, చెట్ల మీదకు ఎక్కారు.



బస్సుపై నుంచి తిలకిస్తున్న అభిమానులు..



చెట్టు ఎక్కి ఇలా..

మండుటెండలో భోజనం

- ఎన్నికల సిబ్బందికి ఇక్కట్లు

రాజాం మే 2: ఎన్నికల సిబ్బందికి గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందికి మధ్యాహ్న భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే టెంట్లు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో నిలబడి భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు.




భోజనం కోసం మండుటెండలో..


పూసపాటి అశోకగజపతి రాజు

విజయనగరం జిల్లాకు కళలు... విద్య పరంగానే కాదు.. రాజకీయంగానూ మంచి ప్రాముఖ్యం ఉంది. ఈ జిల్లా నుంచి అనేక మంది మంత్రులుగా బాధ్యతలు చేపట్టి... ఆ పదవులకు వన్నె తెచ్చారు.
ఇదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఆ తరువాత అనేక మంది వివిధ ప్రధాన శాఖలకు మంత్రులుగా వ్యవహరించారు. తమదైన శైలిలో పాలనపై ముద్ర వేశారు.


పతివాడ నారాయణ స్వామి నాయుడు


కోళ్ల అప్పలనాయుడు



మంత్రులుగా మనోళ్లు!

- ఎస్.కోట నుంచి ఏకంగా సీఎం పదవి
- ఆ తరువాత ఆ నియోజకవర్గానికి దక్కని మంత్రి యోగం
- సుదీర్ఘకాలం మంత్రులుగా అశోక్ గజపతిరాజు, బొత్స సత్యనారాయణ

(శృంగవరపుకోట)

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని వివిధ నియోజక వర్గాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో చాలా మందికి మంత్రి వర్గంలో చోటు దక్కింది. విజయనగరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పూసపాటి అశోక్‌గజపతిరాజు, చీపురుపల్లి నుంచి ఎన్నికైన బొత్స సత్యనారాయణలకు సుదీర్ఘ కాలం పాటు మంత్రులుగా చేసిన అనుభవం ఉంది.

మంత్రులుగా..

- విజయనగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన పూసపాటి అశోక్‌గజపతి రాజు సుదీర్ఘకాలం పాటు రాష్ట్ర మంత్రి వర్గంలో పని చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొత్స సత్యనారాయణ మంత్రిగా ఎక్కువగా కాలం పనిచేశారు. ప్రస్తుతం ఆయనే జిల్లాకు మంత్రిగా ఉన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కిమిడి మృణాళిని గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- బొబ్బిలి నియోజకవర్గం నుంచి ఎన్నికైన సుజయ్‌కృష్ణ రంగారావు, పెద్దింటి జగన్మోహన్‌రావు మంత్రి పదవులు అలంకరించారు.
- పార్వతీపురం నియోజకవర్గం నుంచి ఎన్నికైన శత్రుచర్ల విజయరామరాజు అటవీశాఖ మంత్రిగా పనిచేశారు. చీకటి పరశురాముడు పరిశ్రమల శాఖ మంత్రిగా కొంత కాలం ఉన్నారు.
- గజపతినగరం నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన పడాల అరుణ రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు.
- సాలూరు నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే బోయిన రాజయ్య మంత్రి పదవి చేపట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.
- రద్దయిన ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కోళ్ల అప్పలనాయుడు దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇదే నియోజకవర్గం నుంచి పద్మనాభరాజు మంత్రి పదవి చేపట్టారు.
- భోగాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పతివాడ నారాయణ స్వామి నాయుడు చక్కెర శాఖ మంత్రిగా పనిచేశారు.
- రద్దయిన సతివాడ నియోజకవర్గం నుంచి అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పెనుమత్స సాంబశివరాజు మంత్రి మండలిలో చోటు సంపాదించారు.
- వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు రద్దయిన తెర్లాం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై నీటి పారుదల, విద్యుత్ శాఖల మంత్రిగా సేవలు అందించారు.


పెద్దింటి జగన్మోహన్‌రావు


సుజయ్‌కృష్ణ రంగారావు

ముఖ్యమంత్రిగా టంగుటూరి

ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన టంగుటూరి ప్రకాశం పంతులు శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. జిల్లా వాసి కానప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న సీవీ సోమయాజులు శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రకాశం పంతులుకు అవకాశం కల్పించారు. ఆ తరువాత ఈ శాసన సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలెవరికీ మంత్రి యోగం దక్కలేదు.


టంగుటూరి ప్రకాశం పంతులు


బొత్స సత్యనారాయణ


పడాల అరుణ


కిమిడి మృణాళిని


వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు


పెనుమత్స సాంబశివరాజు


పీడిక రాజన్నదొర


శత్రుచర్ల విజయరామరాజు

నిరక్షరాస్యులకు
ఓటు హక్కు ఉండేది కాదు

మీకు తెలుసా?



విజయనగరం: రాజ్యాంగం 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు పొందే అవకాశం కల్పించింది. కుల, మత, వర్గ, లింగ, ధనిక, పేద, ప్రాంతాల కతీతంగా అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. బ్రిటిష్ పాలనా కాలంలో కేవలం ప్రభుత్వోద్యోగులు, చదవడం, రాయడం వచ్చినవారు, భూస్వాములు, బ్రిటిష్ ఏలుబడిలో పనిచేసే సిబ్బందికి మాత్రమే ఓటుహక్కును కల్పించే వారు. ప్రధానంగా నిరక్షరాస్యులకు అసలు ఓటుహక్కు ఉండేది కాదు. దేశంలో 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల నుంచి అర్హులందరికీ ఓటుహక్కు కల్పించారు. 1952, 1957ల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రత్యేకంగా పోలింగ్ పెట్టెలను ఏర్పాటు చేసేవారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఆ డబ్బాలో ఓటు వేసే వారు. అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంతమంది ఉన్నా ఒకే డబ్బాను కేటాయించి అందులో ఓటు వేసే విధానం అమల్లోకి తీసుకువచ్చారు.1962 నుంచి ప్రతి పోలింగ్ కేంద్రంలో అందరు అభ్యర్థులకు కలిపి ఒకే డబ్బాను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పత్రాలతో ఓటువేసే విధానం నుంచి నేడు ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలను వినియోగించే వరకూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు.

అభ్యర్థులూ.. ఆరోగ్యం పదిలం

- ప్రచారంలో జాగ్రత్తలు తప్పనిసరి

(విజయనగరం)



వేసవి ప్రారంభం నుంచీ ఈ ఏడాది భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తి పోతున్నారు. ప్రతిరోజూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనాలు భయపడుతున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోంది. దీంతో పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచార పర్వంలో మునిగి తేలుతున్నారు. అయితే, వారిని ఎండలు ఆందోళనకు గురిచేసున్నాయి. ఉదయం పది గంటలు దాటితే ఎండలు మండిపోతుండడంతో ప్రచారానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



- ఉదయం అభ్యర్థులు, మద్దతుదారులు అల్పాహారం తీసుకొని ప్రచారానికి వెళ్లాలి. ఖాళీ కడుపుతో ప్రచారంలో పాల్గొనరాదు. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటలు, సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రచారం చేయాలి. వీలైనంతవరకు ఎండలో తిరగరాదు.
- వాతావరణం చల్లగా ఉన్న సమయంలోనే ఇంటింటా ప్రచారం చేయాలి. ఎండలో ప్రచారం చేయడం తప్పనిసరైతే గొడుగులు వెంట తీసుకెళ్లాలి. అభ్యర్థులు, అనుచరులు తప్పకుండా గొడుగు, టోపీలను విధిగా ధరించి ఎండనుంచి ఉపశమనం పొందాలి.
- ప్రచారం సమయంలో ఎక్కడైనా చెట్ల కింద లేదా భవనాల వద్ద సేదతీరాలి. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ప్రచారంలో దిగాలి. చెమట రూపంలో లవణాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. నీరు ఎక్కువగా తీసుకోవాలి. తమ వెంట నీళ్ల సీసాలు ఉంచుకోవాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటివి వెంట ఉంచుకోవాలి.
- మజ్జిగ తాగడం, కర్భూజ తీసుకోవడంతో ఉష్ణ తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. అంబలి, పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి శక్తిని, ఉత్సాహాన్నిస్తాయి.
- బయట శీతల పానీయాలు, ఎక్కడ పడితే అక్కడ నీళ్ల తాగవద్దు. చల్లదనంకోసం ఐస్‌క్రీములు తినవద్దు. మాంసం, వేపుడు కూరలు, నూనె పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. మాంసకృత్తులు తీసుకోవడం వల్ల శరీరాన్ని నిస్సత్తువను చేసి ప్రచారంలో అలసటను తెస్తుంది. సాధ్యమైనంత వరకు శాఖాహారం తీసుకోవాలి.
- మద్యం, ధూమపానం మానేయడం ఆరోగ్యానికి మంచిది. కాఫీలు, టీలు కూడా తాగకపోవడం ఉత్తమం.
- రాత్రివేళ ఆహారం తక్కువగా తేసుకుంటే ఉదయం ఉత్సాహంగా ఉంటారు.
- వేసవిలో కలుషిత నీరు, కలుషిత ఆహారంతో అతిసారం, కామెర్లు, టైఫాయిడ్, వడదెబ్బ తదితర జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.
- కాచిచల్లార్చిన నీటిని వడకట్టి తాగాలి. నీటిని శుభ్రపరచడానికి బిందెడు నీటిలో ఒక క్లోరిన్ బిళ్లను వేసి అరగంట తర్వాత తాగాలి.
- మల, మూత్ర విసర్జనల అనంతరం, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- నిమ్మరసంలో ఉప్పు మిశ్రమాన్ని కలిపి తాగాలి.
- ఎండలో తిరగడం వల్ల తొందరగా అలిసిపోవడంతో పాటు విరేచనాలు అవుతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.


చీపురుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో జనసందోహం

బాలయ్యకు ఘన స్వాగతం


బాలకృష్ణతో జనసేన పార్టీ నాయకులు

'స్వర్ణాంధ్ర సహకార యాత్ర'లో భాగంగా సినీ నటుడు, హిందూపురం నియోజకవర్గ శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ గురువారం చీపురుపల్లి, విజయనగరంలో పర్యటించారు. ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు, అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయనను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్డు షోకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు.


ఫొటోలు తీస్తున్న బాలయ్య అభిమానులు


విజయనగరంలో బాలకృష్ణ రోడ్ షో..


కళా వెంకటరావుతో బాలకృష్ణ మాటామంతీ

అభివృద్ధికి ఓటు వేయండి: జగదీశ్వరి


కొమరాడ: ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి జగదీశ్వరి

కొమరాడ: అభివృద్ధికి, విధ్వంసానికి మధ్య జరుగుతున్న పోరులో ప్రతిఒక్కరూ అభివృద్ధికి ఓటు వేసి, గెలిపించాలని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని ఇందిరానగరం, గాంధీనగరం, ఉలిపిరి, అల్లువాడ, చోళ్లపథం, కొట్టు, తొడుము, దళాయిపేట గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు అధ్యక్షతన గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు సుదర్శనరావు, వెంకటనాయుడు, మధుసూదనరావు, తమ్మయ్య, పద్మావతి, జనసేన మండల కన్వీనర్ శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు. ● కొమరాడ పంచాయతీ కొత్తవలస వలంటీరుగా పనిచేస్తున్న కొండగొర్రి ప్రవీణ్‌కుమార్ టీడీపీ కండువా కప్పుకున్నారు. గురువారం కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆయనకు పార్టీ కండువా వేసి, ఆహ్వానించారు. టీడీపీ మండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు, సుదర్శనరావు, మధుసూదనరావు, డి.వెంకటనాయుడు, తదితరులు ఉన్నారు. ● **కురుపాం:** కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరుతూ ఉదయపురం పంచాయతీ పరిధిలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. జీవీ రమణ మూర్తి, వెంపటాపు, సుబ్బలక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు. ● కురుపాం పంచాయతీ కాటర్‌దొరవలస గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గురువారం వీరిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కద్రక మల్లేష్, జనసేన మండల కన్వీనర్ నేరుడబిల్లి వంశీ, టీడీపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** చిలకాం పంచాయతీ పరిధిలో టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ ప్రచారం నిర్వహించారు. ఎం.పు రుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, తవిటినాయుడు, ఎం.సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర


సీతానగరం: ప్రచారంలో పాల్గొన్న విజయచంద్ర

సీతానగరం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. సీతానగరం మండలంలోని సుమిత్రపురం, బూర్జ గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు సత్యంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** పార్వతీపురం నియోజకవర్గంలో ఏ గ్రామం తట్టినా, ఏ వార్డు ముట్టినా టీడీపీకి అపూర్వ ఆదరణ కనిపిస్తోందని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం సీతానగరం మండలం కాజీపేట గ్రామానికి చెందిన మడక రాంబాబు, సింహాచలం, సురేష్, కృష్ణ, శివునినాయుడు, తిరుపతి, వాసు, చొక్కా వేణు, సింహాచలం, తేలు రాంబాబు, సత్తెయ్య, పిల్లి శ్రీను తదితరుల ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీతానగరం మండల అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, పార్టీ నాయకులు టెంటు వెంకటప్పలనాయుడు, తేలు శేఖర్, తిరుపతిరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: సంధ్యారాణి


ప్రచారంలో పాల్గొన్న సంధ్యారాణి

సాలూరు: ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏమిటో పట్టణ వాసులకు చేసి చూపిస్తానని కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 7, 8, 1, 29 వార్డుల్లో ఆమె గురువారం ప్రచారం నిర్వ హించారు. అడుగడుగునా ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే నిరుద్యోగ యువత కోసం డీఎస్సీ నిర్వహణపై తొలి సంతకం చేస్తారని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించటం, విద్యుత్ ధరలు పెరగకుండా చూడటం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పార్టీ నాయకులు కేతిరెడ్డి చంద్రఖర్, అక్కేన అప్పారావు, తోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

మక్కువ: కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జనసేన పార్టీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల రిషివర్ధన్ కోరారు. గూనుకొండవలస గ్రామంలో ఆయన గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మావుడి ప్రసాదరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

● ఆర్వో శుభం బన్సల్


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఆర్వో

పాలకొండ: రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. పాలకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంను ఆయన గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని, త్వరలో కమీషనింగ్ ప్రక్రియ చేపడతామని ఆయన చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంలను ర్యాండమైజేషన్ చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీల్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వరహాలు ఉమామహేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ రిజిస్టర్ల పరిశీలన


అభ్యర్థులతో ఎన్నికల వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్లను అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రమాకంత్ ప్రధాన్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అసెంబ్లీ నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికార కార్యాలయంలో వ్యయ పరిశీలన బృందాలతో రిజిస్టర్లను పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. వ్యయ రిజిస్టర్‌లో అభ్యర్థి ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మళ్లీ మే 6, 11 తేదీల్లో వ్యయ రిజిస్టర్లు పరిశీలన ఉంటుందని, ఆ రోజుల్లో తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలని ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులు, వ్యయ పరిశీలన బృందాలు పాల్గొన్నాయి.

ఐటీడీఏలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ

సీతంపేట: నియోజకవర్గంలో పోలింగ్ విధులు నిర్వహించేందుకు వేరే నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు గురువారం స్థానిక ఐటీడీఏ మీటింగ్ హాల్, బాలికల గురుకుల పాఠశాలలో పోలింగ్ విధులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి మాస్టర్ ట్రైనీలు, ఈవీఎం యంత్రాల పనితీరు, మాక్ పోలింగ్ చేసే విధానం, నివేదికలు సమర్పించే వివిధ ఫారాలపై శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారులు అడిగిన వివిధ సందేహాలను మాస్టార్ ట్రైనీలు నివృత్తి చేశారు. ఈ శిక్షణలో సెక్టార్ అధికా రులు, రూట్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంటలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన డీఈ ఫణికిరణ్‌కుమార్

పాచిపెంట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రూ.1.20 కోట్లు విలువ చేసే 5 ఎంవీఏ సామర్థ్యంగల అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలక్ట్రికల్ డీఈ ఫణికిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల లోవోల్టేజీ సమస్య ఉండదని, వ్యవసాయ పంపు సెట్లకు నీటి సరఫరాకు అంతరాయం ఉండదని చెప్పారు. గతంలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఇబ్బందులు ఉండేవని, ఆ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ వి.రంగారావు, ఈఈ పెద్దింటి త్రినాథరావు, జేఈ సింహాచలం, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

పవన్ సభకు తరలివెళ్లిన కూటమి నాయకులు

భామిని: పాలకొండలో పవన్‌కళ్యాణ్ బహిరంగ సభకు ఆదివాసీలు, కూటమి నాయకులు గురువారం తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాలతో బయలుదేరి వెళ్లారు. భామిని మండలంలోని బొడ్డగూడ, మణిగ పంచాయతీలకు సంబంధించిన గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు ఉత్సాహం చూపించడం విశేషం. లగేజీ వ్యాన్‌లతో భారీగా తరలివెళ్లారు.


పాలకొండలోని పవన్‌సభకు వెళ్తున్న దృశ్యం

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సాలూరు: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ వాసునాయుడు కోరారు. పట్టణంలో గురువారం కేంద్ర బలగాలతో కలిపి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. డబ్బి వీధి, కోటవీధి, పెద్దహరిజనపేట, వెంకటేశ్వర కాలనీల్లో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న సాధారణ ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింహాచలం రాజీనామా

గుమ్మలక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడు మృతి


రామకృష్ణరాజు (ఫైల్)

గుర్ల: ఆనందపురం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లూరి రామకృష్ణరాజు(53) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం మధ్యా హ్నం మెరకముడిదాం బయలుదేరారు. తమ గ్రామం నుంచి బైకుపై గుర్ల వెళ్తుండగా కలవచర్ల గ్రామం సమీపంలో ఉన్న దొంగలకొనేరు సమీపంలో ఎదురు గా వస్తున్న బైకును తప్పించబోయి ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తాపడ్డారు. తీవ్ర గాయాలైన ఆయనను విజయన గరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ ఆయన గురువారం తెల్లవారుజామున మృతి చెందా రు. ఈయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈయన మృతికి టీడీపీ, బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పారసాం, కొండవెలగాడ ఫీడర్ల పరిధిలోని పలు గ్రామాలకు ఈనెల 4వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. కొండవెలగాడ ఫీడర్ పరిధిలోని ఎల్‌పురం, కొండవెలగాడ, ఆక్సిజన్ వ్యాలీ, పీసీఆర్ హరివిల్లు, సెంచూరియన్ విశ్వవిద్యాలయం, జేహెచ్‌సీ కాలనీ, ఎంఆర్ లేఅవుట్, అలాగే పారసాం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

సైకిల్‌తో రాష్ట్రమంతా పర్యటన


నితిన్‌ను అభినందిస్తున్న యోగా గురూజీ జనార్దనరావు

పాలకొండ: నెల్లూరుకు చెందిన చింతపూడి నితిన్ ఇంజినీరింగ్ పూర్తి చేసి రాష్ట్రమంతా సైకిల్‌పై పర్యటన చేస్తున్నారు. నెల్లూరు జిల్లా కావలి నుంచి ఫిబ్రవరి 27న సైకిల్‌పై బయలుదేరి సుమారు 3,500 కిలోమీటర్లు ప్రయాణం కొనసాగిస్తూ అనేక ఆధ్యాత్మిక సేవా సంస్థలు దర్శించి, గురువారం పాలకొండ చేరారు. కోటదుర్గమ్మ, రామలింగేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. రుషి యోగా కేంద్రానికి విచ్చేసి, యోగా గురూజీ జనార్దనరావును కలిశారు.

ఉపాధి పనుల పరిశీలన


మస్తర్లను పరిశీలిస్తున్న కార్యదర్శి సాయికృష్ణ

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను పంచాయతీ కార్యదర్శి బలగ వెంకట సాయికృష్ణ గురువారం పరిశీలించారు. ఈ మేరకు మస్తర్లను పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా వేతనదారులు తగు జాగ్రత్త తీసుకోవాలని ఆయన సూచించారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకుడు మర్రాపు శంకరరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా జైగురుదత్త హోమాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆలయ అర్చకుడు మృతి

సీతంపేట: సీతంపేటకు చెందిన వినాయక ఆలయ అర్చకుడు వేమకోటి విశ్వేశ్వరరావు(68) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన గతనెల 28న తన భార్య, బంధువులతో కలిసి మధ్యప్రదేశ్‌లో నర్మదా పురస్కారాలకు వెళ్లారు. అక్కడ గుండెపోటు రావడంతో మృతిచెందారు. ఈ విషయం సీతంపేటలో ఉన్న ఆయన కుమారుడు వేమకోటి సాయికి సమాచారం అందించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహం శుక్రవారం సీతంపేట చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

హామీలు అమలు చేయడం కాంగ్రెస్‌కే సాధ్యం

● తెలంగాణా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్క



మాట్లాడుతున్న భట్టీవిక్రమార్క

రాయగడ: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్క అన్నారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా రాయగడ చేరుకున్న ఆయన.. గురువారం స్థానిక హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిందన్నారు. అమలు చేయగలిగే హామీలను మాత్రమే కాంగ్రెస్ ఇస్తుందని చెప్పారు. ఒడిశాలో కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని హామీలను నెరవేరుస్తుందని ఆయన స్పష్టంచేశారు. బీజేడీ పాలనలో నిరుద్యోగం పెరిగి యువత నిరాశ నిస్పృహలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, కొంతమంది ఉపాధి కోసం వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు అభ్యర్థి సప్తగిరి ఉలకా, శాసన సభ అభ్యర్థి అప్పలస్వామి కద్రక, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రవీంద్ర దాల్వి, ఒడిశా ఇన్‌చార్జి షాహన్‌వాజ్ చౌదురి, దుర్గాపండా తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా

